తెల్లబోతున్న తెల్ల బంగారం

- రైతులు సరుకును అమ్ముకోవాలంటే పక్క మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి
- వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురి డిమాండ్

ధరలేక పత్తి రైతులు విలవిల

పేరుకే ప్రారంభమైన సీసీఐ కొనుగోలు కేంద్రాలు

దళారులకు దారులు తెరిచేందుకే మాకీ దుస్థితి అంటున్న రైతులు



ఆరు బయట పత్తి నిల్వలు

తాడికొండ: రైతులు కోటి ఆశలతో ఆరుగాలం శ్రమించి వర్షాలు, వరదలను తట్టుకొని పండించిన తెల్ల బంగారం ధరలేక తెల్లబోతుంది. చేతికందిన పంట నోటికందే సమయానికి ప్రభుత్వం దళారులకు దారులు తెరవడంతో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నామ మాత్రంగానే కొనసాగుతుంది. గత ప్రభుత్వాల హయాంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి పత్తిని సేకరించేవారు. ఈ విధానంలో రైతులు పంటను యార్డుకు తరలించి గోదాములలో పెట్టుకొని మద్దతు ధరకు అమ్ముకునేవారు.

కానీ ఈ ఏడాది ప్రభుత్వం దళారులకు దారులు తెరిచి సీసీఐ కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డులను వదిలి స్పిన్నింగ్ మిల్లుల వద్దకు వెళ్లి అమ్ముకోవాలని సూచిస్తుండటంతో రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి అన్న చందంగా మారింది.

నిబంధనల ప్రకారం ధరను నిర్ణయించాలి

నిబంధనల ప్రకారం పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ బయ్యర్ పాసింగ్ చేసి రైతుల వద్ద తేమ శాతం పరిశీలించి ధరను నిర్ణయించాలి. అయితే ప్రస్తుతం స్పిన్నింగ్ మిల్లుల వద్దకు సరుకును తీసుకొని రైతులు వెళితే అక్కడ తిరస్కరించడం లేదా సరుకు నాణ్యత వంకతో ధరను తగ్గించి కొనుగోలు చేస్తామంటే తమ పరిస్థితి ఏంటని రైతులు వాపోతున్నారు.

- ప్రభుత్వ నిర్ణీత మద్దతు ధర రూ.7,521కి క్వింటా పత్తిని కొనుగోలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం రైతులు బహిరంగ మార్కెట్లో రూ.5,500కు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.
- ఈ ఏడాది పత్తి పంటకు నాణ్యత ఉండటంతో రైతులు అధిక ధర పలుకుతుందనే ఆశతో ఉన్నప్పటికీ సీసీఐ కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకురాని కారణంగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు.
- తాడికొండ మండలానికి చెందిన రైతులు పత్తిని అమ్ముకోవాలంటే 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామంలోని శివసాయి టీఎంసీ సిండికేట్ మిల్లుకు పత్తిని తరలించి అమ్ముకోవాల్సిన పరిస్థితి. దీనిపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- దళారీ వ్యవస్థను నియంత్రించి మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తే తప్ప ఈ ఏడాది పెరిగిన పెట్టుబడి వ్యయం, పురుగు మందులు, కూలీ ఖర్చులు గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని పలువురు వాపోతున్నారు.
- సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి పత్తి రైతులను ఆదుకునేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



పతనమైన పత్తి ధరలను పెంచాలంటే ప్రభుత్వం, అధికారులు వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తాడికొండ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయాలి. పత్తిపాడు మండలంలో ఉన్న మిల్లుకు తరలించి పత్తిని అమ్ముకోవాలంటే చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బందిగా మారింది. గతంలో మాదిరి సీసీఐ కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంచడం ద్వారా దళారులను అరికట్టవచ్చు. స్థానిక శాసనసభ్యులు దీనిపై దృష్టి సారించి రైతులకు సీసీఐ కేంద్రం అందుబాటులోకి తీసుకురావాలి.

– దూసరి డేవిడ్, రైతు, బడేపురం

నాణ్యమైన పత్తి ఉన్నప్పటికీ ధర తక్కువ



ఈ ఏడాది పత్తి పంట నాణ్యత చాలా బాగా ఉంది. అయినప్పటికీ సీసీఐ కేంద్రాలు అందుబాటులో ఏర్పాటు చేయని కారణంగా రైతులు తక్కువ ధరకు నాణ్యమైన పత్తిని అమ్ముకోవాల్సి వస్తుంది. నిల్వ చేసుకుంటే రంగు మారి పత్తికి ధరలు తగ్గే ప్రమాదం ఉన్నందున రైతులు అవస్థలు పడుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఐ.రమేష్ బాబు, రైతు, తాడికొండ

ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలి



పత్తి రైతులు ఈ ఏడాది నానా ఇబ్బందులు ఎదుర్కొని పంటను పండించారు. కానీ వారికి గిట్టుబాటు ధర లేని కారణంగా నానా ఇబ్బందులు పడుతున్నారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపి వెంటనే స్పందించాలి. లేకుంటే వ్యవసాయంలో పెరిగిన పెట్టుబడులు, కూలీ ఖర్చులు తడిసి మోపెడై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి పొంచి ఉంది.

– చింతల భాస్కరరావు, సీపీఎం మండల కార్యదర్శి

క్లుప్తంగా

పలు గ్రామాల్లో 'ఫ్రైడే-డ్రై డే'



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంతేకాక ఇంట్లో నీరు నిలువ ఉండే ప్రదేశాలు పరిశీలించారు. నాలుగు రోజులకు మించి నీరు నిలువ ఉంచుకోవద్దని దాని ద్వారా దోమలు వృద్ధి చెందుతాయని సూచించారు. దోమల వృద్ధితో మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వస్తాయని చెప్పారు. మురికిగా ఉన్న గాబులోని నీటిని బయటకు పారబోయించారు.

ఖాళీ స్థలాలకు పన్నులు వేయించుకోవాలి

ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా

మంగళగిరి/తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాలకు సంబంధిత యజమానులు పన్నులు వేయించుకోవాలని కమిషనర్ అలీంబాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాలపై పన్నులు విధించేందుకు శని, ఆదివారాలలో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ అలీంబాషా తెలిపారు. 9, 10 తేదీలు సెలవు దినాలు అయినా మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలోను, తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాయలంలో సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. కావున ఖాళీ స్థలాల యజమానులు దరఖాస్తుతో పాటు సంబంధిత స్థలాల దస్తావేజులతో సంప్రదించి ఖాళీ స్థలాలపై పన్నులు వేయించుకోవాలని కోరారు.

నేడు సహస్ర లింగార్చన

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం సహస్ర లింగార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు చింతలపాటి లక్ష్మీ నారాయణ శుక్రవారం తెలిపారు. కార్తిక మాసం పురస్కరించుకొని శనివారం ఆలయంలో ఉదయం విఘ్నేశ్వరపూజ, అఖండ దీపారాధన, స్వామి వారికి మన్యుసూక్తంతో అభిషేకం, సర్వతో భద్ర మండపారాధన, సహస్ర లింగార్చన జరుగుతాయని చెప్పారు. శ్రవణ నక్షత్రం పురస్కరించుకొని పార్థివలింగాలు (వెయ్యి నూటపదహారు) మట్టితో తయారు చేసి వాటికి విశేష పూజలు నిర్వహిస్తామని చెప్పారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ పాల్గొని పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

ఫిరంగిపురం: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను దూరం చేసుకోవచ్చని డాక్టర్ శాంతి అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 127 మందికి రక్త, మూత్ర, బీపీ, షుగర్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేసి రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం వల్ల ఉపయోగాలు వివరించారు. డాక్టర్ శాంతి మాట్లాడుతూ చేతులు శుభ్రత తప్పక పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం అరుణ, మేల్ అసిస్టెంట్ బాబురావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలి



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలోని చిట్యాల ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఎంటీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు రాము, సహాయ ఇంజనీర్ అనూష తదితరులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరి భాస్కరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా సుబ్బారావులు ఇంజనీరింగ్ అధికారులకు వినతిప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం నాయకులు మాట్లాడుతూ 2020 జూలై 1వ తేదీన శంకుస్థాపన చేసి నేటికి 5 సంవత్సరాలు పూర్తి అయినా నిర్మాణం పూర్తి కాకపోవడం విచారకరమని, కమ్యూనిటీ హాలు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కోరామని, పూర్తిస్థాయి పనులను అంచనా వేసి కమిషన్ ద్వారా స్థానిక శాసనసభ్యులు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు తాడేపల్లి నగర గౌరవ అధ్యక్షులు మోర్తోట సుబ్బారావు, తాడేపల్లి సాంబశివరావు, తాడేపల్లి మల్లేశ్వరి పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి



తాడికొండ: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర సేవలు అందించాలని తాడికొండ ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం తాడికొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు పెండింగ్‌లు లేకుండా సత్వరమే పరిష్కరించాలని, అభివృద్ధి పనులు వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవో సమతావాణి మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా విధుల్లో అలసత్వం వహించకుండా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం అన్ని విభాగాల అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గణేష్ రెడ్డి, తహసీల్దార్ కె.నాసరయ్య, ఈవోపీఆర్డీ శివలీల పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

మంగళగిరి: కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోషియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీఎస్ఆర్ శర్మ, బిజె గాంధీలు కోరారు. శుక్రవారం మాట్లాడుతూ ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు జీవోఎంఎస్ నంబర్ 114 విడుదల చేసినా దురదృష్టవశాత్తూ కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించలేదన్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక ఆందోళన బాట పట్టామన్నారు. అందులో భాగంగా ఈ నెల 10వ తేదీ ఆదివారం పిఠాపు రం, మంగళగిరి, కుప్పంలలో లక్ష్మీగణపతి హోమాలు చేపట్టామన్నారు. మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం చేపట్టడం జరిగిందన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 35 శాతం ఐఆర్ ప్రకటించాలి

ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సుధీర్‌బాబు



మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: వేతన సవరణ సంఘ ఏర్పాటులో తీవ్ర జాప్యం నెలకొన్న దృష్ట్యా, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 35 శాతం మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని అఖిల భారత సెకండరీ టీచర్స్ అసోసియేషన్(ఏఐఎస్టీఎఫ్) ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం సంఘ ప్రాంతీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి, కమిటీ నివేదిక వచ్చేవరకు 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాలు సైతం ఉద్యోగులకు డీఏలు ప్రకటించినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఏల ఊసు ఎత్తడం లేదని విమర్శించారు. పెరుగుతున్న జీవన ప్రమాణాలు, నిత్యావసర ధరల పెరుగుదల దృష్ట్యా తక్షణమే కరవు భత్యాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.26 వేల కోట్ల మేరకు పేరుకుపోయిన డీఏ, పీఆర్సీ, పెండింగ్ బకాయిలను క్లియర్ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ యాప్‌ల భారం లేకుండా చేస్తామని చెప్పిన ప్రభుత్వం తగ్గించకపోగా అపార్ ఐడీలు అంటూ ఇతరత్రా పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసి మానసిక ఒత్తిడి కలుగజేస్తోందని ఆరోపించారు. యాప్‌ల భారాన్ని తొలగించడంతో పాటు అపార్ ఐడీల జనరేషన్‌లో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరించి, ప్రతి గ్రామంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి, రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ ఒకే పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తూ, ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు. 117 జీవోను రద్దు చేస్తామని చెప్పిన ఎన్నికల హామీ మేరకు వెంటనే ఆ జీఓను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. 2022 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాస్‌మెంట్, 2024 మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, క్లోజర్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిమళ్ల ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్లు డీఏజోసెఫ్, షేక్ బాజీ, సుబ్బారావు, గుంటూరు నగరపాలక సంస్థ, తుళ్ళూరు, తాడికొండ, మేడికొండూరు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు

365 మందికి రూ.15.65 లక్షల జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ అధికారులు

మంగళగిరి: నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు విజిలెన్స్ ఆపరేషన్ విభాగం పర్యవేక్షక ఇంజనీర్ పి.సుబ్రమణ్యం తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 365 మంది వినియోగదారులకు రూ.15.65 లక్షల జరిమానా విధించడం జరిగిందన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు, చినకాకాని, చినవడ్లపూడి, కాజా, కొత్తపాలెం, నూతక్కి, పెదవడ్లపూడి ఏరియాలలో తనిఖీలు నిర్వహించామన్నారు. మీటరు ఉన్నప్పటికి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఒకరికి రూ.0.30 లక్షలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుతున్న ఇద్దరికి రూ.0.05 లక్షలు, లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుకుంటున్న 362 మందికి రూ.15.30 లక్షలు వెరసి రూ.15.65 లక్షల జరిమానా విధించామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖ నిబంధనల మేరకే విద్యుత్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు సీహెచ్ వెంకటేశ్వరరావు, జే సంజీవరావు, డీఈఈ సురేష్ బాబు, ఏఈలు ఎం.సతీష్‌బాబు, యు.శివశంకర్, జి.మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అసోషియేషన్‌కు సొంత భవనం నిర్మించుకోవడం సంతోషకరం

పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోషియేషన్ (పివా) కేంద్ర కమిటీ అధ్యక్షుడు పుల్లారావు



మాట్లాడుతున్న పివా అధ్యక్షుడు స్వర్గం పుల్లారావు

మంగళగిరి: పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోషియేషన్ (పివా) ఏర్పాటు చేసిన నాటి నుంచి నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టి అసోషియేషన్‌కు సొంత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమని పివా కేంద్ర కమిటీ అధ్యక్షుడు స్వర్గం పుల్లారావు తెలిపారు. శుక్రవారం జాతీయ రహదారిపై కియా షోరూమ్ పక్కన గల అసోషియేషన్ భవన నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ అసోషియేషన్ 2008 డిసెంబర్ 25న విజయవాడలో ఏర్పడి 50 మందితో ప్రారంభమై 2,700 మంది సభ్యులతో నిలిచిందన్నారు. అసోషియేషన్ ఏర్పడిన అనంతరం రూ.1 కోటి 70 లక్షల కార్పస్ ఫండ్‌తో పద్మశాలి పేద విద్యార్థులకు, చేనేత కుటుంబాలకు సహాయ సహకారాలు అందించిందన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 7,500 మందికి కంటి ఆపరేషన్లు చేయించి కళ్లజోళ్లు ఇప్పించామన్నారు. వర్షాలకు, తుపానులకు మగ్గాలు దెబ్బతిన్న చేనేత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. రూ.3 కోట్లతో 520 చదరపు గజాల స్థలంలో నిర్మాణం చేయనున్న భవనానికి ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉదయం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనుండగా ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, పంచుమర్తి అనురాధలతో పద్మశాలి ప్రముఖులు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి విన్నకోట వెంకటేశ్వర్లు, కోశాధికారి నీలి కనకదుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శి మురుగుడు లక్ష్మీనారాయణ, కేంద్ర కమిటీ సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, అందే వెంకన్న, అందే మురళి, దుర్గారావు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మహిళా పోలీసులు



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి వెంబడి గత రెండు రోజుల నుంచి మతి స్థిమితం లేని ఓ మహిళ వస్త్రాలు లేకుండా తిరుగుతోంది. సమాచారం అందుకున్న తాడేపల్లి మహిళా పోలీసులు శుక్రవారం ఆమె వద్దకు చేరుకున్నారు. ఆ మహిళ వద్దకు వెళ్లిన మహిళా కానిస్టేబుళ్లు లలితకుమారి, రమాకుమారిపై ఆ మహిళ దాడిచేసేందుకు ప్రయత్నించింది. అరగంట సేపు ఆమెకు మర్యాదలు చేసి ఆహారం తినిపించి, వస్త్రాలను స్వయంగా వారే కట్టారు. అనంతరం శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు ఆ ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను వారికి అన్ని విధాలా సహకరించిన ఏఎస్ఐ శాంతకుమార్‌ను అభినందించారు.


రేషన్ పంపిణీలో ఫిర్యాదులొస్తే చర్యలు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన కార్డుదారుడు

పొన్నూరు: ప్రతి నెలా కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా అందించే రేషన్, ఇతర సరుకులు సక్రమంగా అందించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన తెల్ల రేషన్ కార్డుదారుడు నాగుర్‌బాషా మూడు నెలల నుంచి రేషన్, సరుకులు ఇవ్వడం లేదని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని తహసీల్దార్ ఆదేశించారు. రేషన్ పంపిణీపై వార్డు ప్రజలను విచారించాలని సూచించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఈ

కాకుమాను: నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగదారులు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా విద్యుత్ శాఖ అధికారి(ఎస్ఈ) జి.ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని గ్రామాలలో శుక్రవారం సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ మండలంలోని 2,857 విద్యుత్ సర్వీస్‌లను పరిశీలించగా వాటిలో 87 మంది అదనంగా విద్యుత్ ఉపయోగిస్తున్నారని తెలిపారు. వారికి రూ.4.03 లక్షలు అపరాధ రుసుం వేసినట్లు చెప్పారు. గృహ అవసరాల కోసం విద్యుత్ మీటర్లు తీసుకుని వ్యాపార లావాదేవీలకు ఉపయోగిస్తున్న ఇద్దరిని గుర్తించి వారికి తొమ్మిది వేలు అపరాధ రుసుం వేసినట్లు చెప్పారు. మొత్తం 90 కేసులు నమోదు చేసి రూ.7 లక్షల 13 వేలు అపరాధ రుసుం చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎస్ఈ ఆంజనేయులు వెల్లడించారు. పొన్నూరు డీఈ డి.శ్యాంకుమార్, బాపట్ల జిల్లా డీఈఈ డీపీ మల్లికార్జునరావు, ఏఈ పఠాన్ మౌలాలి ఖాన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : బాల్య వివాహాలపై తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్‌యూ విద్యార్థులు శుక్రవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలు యుక్త వయస్సుకు రాకుండా వివాహాలు చేస్తే శారీరక, మానసిక రుగ్మతలకు గురయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులకు వివరించారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండే వరకు వివాహాలు చేయకూడదని ప్రోగ్రాం అధికారి ఎస్.నవీన్ నారాయణనన్, విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్‌లు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.సురేష్ పర్యవేక్షణ వహించగా వలంటీర్లను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు



ప్రమాదంలో బోల్తా పడిన దోస్త్ ఆటో



గాయపడిన డ్రైవర్ నరసారెడ్డి

తాడేపల్లిరూరల్ : కోల్‌కతా చెన్నై 16వ నెంబర్ జాతీయ రహదారిపై వడ్డేశ్వరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవర్‌కు శుక్రవారం తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడ ఆటోనగర్ నుంచి గుంటూరుకు టైర్ల లోడ్‌తో వెళుతున్న దోస్త్ ఆటోను వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన ఓ కారు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో దోస్త్ ఆటో సెంటర్ డివైడర్ ఎక్కి బోల్తా పడడంతో డ్రైవర్ నరసారెడ్డి తలకు తీవ్ర గాయం అయ్యింది. దోస్త్ ఆటో బోల్తా పడడంతో టైర్లు అన్నీ రోడ్డుపై అడ్డంగా పడిపోయాయి. అదే రహదారిలో ప్రయాణిస్తున్న వారు ఆటోలో ఇరుక్కుపోయిన నరసారెడ్డిని బయటకు తీసి ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

జీజీహెచ్‌లో పెట్ సీటీస్కాన్ కొనుగోలుకు అనుమతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ సీటీస్కాన్ మిషన్ కొనుగోలుకు అనుమతి మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యూఢిల్లీకి చెందిన బ్రాండ్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ వారికి పెట్ సీటీ టెండర్లు దక్కించుకోవడంతో వారికి మిషన్ కొనుగోలు ఆర్డర్ జారీ చేశారు. క్యాన్సర్ రోగులకు త్వరితగతిన క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కోసం పెట్ సీటీ స్కాన్ మిషన్ ఎంతో అవసరం. ఈ వైద్య పరికరం జీజీహెచ్‌లో లేకపోవడంతో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా బయట స్కానింగ్ సెంటర్‌లలో చేయిస్తున్నారు. పెట్ సీటీస్కాన్ పరీక్ష చేసేందుకు రూ.25 వేల వరకు ప్రైవేటు స్కానింగ్ సెంటర్ల వారు ఫీజు తీసుకుంటున్నారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ సీటీస్కాన్ అందుబాటులోకి రావడం వల్ల పేద రోగులకు మెరుగైన వైద్యం సత్వర వైద్య సేవలు లభించే అవకాశం ఉంది. వైద్య పరికరం కొనుగోలుకు రూ.18 కోట్లు ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా విడుదల చేసింది. మూడు నెలల్లోపు వైద్య పరికరాన్ని జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకు రావాలంటూ పర్చేజ్ ఆర్డర్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్, నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో కార్పొరేట్ వైద్య సేవలను పేద ప్రజలకు ఉచితంగా అందజేస్తుంది. సుమారు రూ.45 కోట్లతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను నాట్కో ట్రస్టు చైర్మన్ నన్నపనేని వీసీ నిర్మించారు. ఈనెలాఖరులోపు మరో వంద పడకలతో రూ.20 కోట్లతో క్యాన్సర్ చివరి దశలో ఉన్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరో క్యాన్సర్ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివ రావు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com